క్లుప్తంగా

గురుకులంలో ముగిసిన వేసవి శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు. చిత్రంలో సర్వశిక్ష అభియాన్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ నిర్వహించారు. 12 రోజులు పాటు జరిగిన వృత్తి విద్య నైపుణ్య శిక్షణలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించారు. వ్యక్తి ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్మం, జుట్టు, గోళ్లు తదితర బాహ్య అంగాలను ఏవిధంగా సంరక్షించుకోవాలి అనేదానిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మంగళవారంతో ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ సిబ్బంది సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే యాదవులకు సముచిత స్థానం



మాట్లాడుతున్న మువ్వల సురేష్

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలో యాదవ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించిన పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముివ్వల సురేష్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కూటమి నాయకులు అధికార, ధన బలంతో యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళా మేయర్‌ను తొలగించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ నీచమైన చర్యలో తమ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ముందుండటం యాదవ జాతికి వారు చేసిన ద్రోహమని ఆరోపించారు. యాదవ మహిళను మేయర్‌గా కొనసాగించేందుకు యాదవ కార్పొరేటర్లను ఏకం చేసేందుకు శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సూచనల మేరకు తాను ఎంతో కృషి చేశానని సురేష్ గుర్తు చేశారు. యాదవ సామాజిక వర్గాన్ని తక్కువ చేసిన కూటమి ప్రభుత్వానికి త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

నేడు ఎస్.జానకి ప్రత్యేక సినీ సంగీత విభావరి

మద్దిలపాలెం: ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి 87వ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి జరగనుంది. యాక్మీ, జయంతి చౌదరి క్రియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి అని యాక్మీ ప్రతాప్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ బెంగాలీ నృత్య దర్శకురాలు సువశ్రీ బగ్చిని ఉగాది పురస్కారంతో సత్కరించనున్నారు. నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులు ఆర్ సత్య, సుజాత, ఆనంద్, అనూష, కళ్యాణి ఎస్. జానకి పాడిన మధురమైన గీతాలను ఆలపించనున్నారు.

రన్నింగ్ పోటీలో విజేత మోక్షిత్

బీచ్‌రోడ్డు: టింపనీ పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్నింగ్ రేస్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి శేఖరమంత్రి మోక్షిత్ విజేతగా నిలిచాడు. సుమారు పదివేల మంది విద్యార్థులు చదువుతున్న టింపనీ పాఠశాలల స్థాయిలో ఈ పోటీలు జరిగాయి. మంగళవారం ఉదయం ధరిత్రీ దినోత్సవం సందర్భంగా నగరంలో నిర్వహించిన మారథాన్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మారథాన్‌లో భాగంగా జరిగిన 5 కిలోమీటర్ల పరుగు పందెంలో మోక్షిత్ చాంపియన్‌గా నిలిచాడు. అతనికి ముఖ్య అతిథి, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి రూ.5,000 బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. గతంలో కూడా పాఠశాల స్పోర్ట్స్ మీట్‌లో మోక్షిత్ , అతని సోదరుడు ప్రీతమ్ శేఖర మంత్రి కలిసి 20 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శేఖరమంత్రి సోదరులను పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వందన అబ్రహం అభినందించారు.

క్రికెట్ పోటీల్లో ఏఎంసీకి కాంస్యం

దాబాగార్డెన్స్: ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) విద్యార్థులు ఏపీ స్టేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఈ నెల 16 నుంచి 20 వరకు ఈ పోటీలు జరిగాయని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు తెలిపారు. మంగళవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి క్రీడాకారులను అభినందించారు.

అంతా ఎమ్మెల్యే చూసుకుంటారు..!

తూర్పు నియోజకవర్గం అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతోంది. కూటమి నేతలు, నిర్మాణదారులతో కుమ్మక్కై, జీవీఎంసీ నిబంధనలను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాల దందా సాగిస్తున్నారు. నిర్మాణదారులు అక్రమంగా భవనాలు నిర్మిస్తుంటే, కూటమి నేతలు జాబితాలు తయారు చేసుకుని మరీ వాలిపోతున్నారు. 'మీ అక్రమ నిర్మాణానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండాలంటే మాకు కొంత నగదు ఇవ్వాలి. అలా **ఇస్తే జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడతారు. మీ భవనం జోలికి ఏ అధికారి రారు' అని నిర్మాణదారులకు చెబు**తున్నారు. డబ్బులు ఇవ్వడానికి నిరాకరిస్తే, 'భవనాలు ఎలా నిర్మిస్తారో చూస్తాం' అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో బాధితులు ఎంతోకొంత ముట్టజెప్పి, అక్రమ నిర్మాణాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. 'నిజంగా ఎమ్మెల్యే అంతా చూసుకుంటున్నారా?' అనే సందేహాలకు జీవీఎంసీ అధికారులు ఈ అక్రమ నిర్మాణాల జోలికి రాకపోవడం బలం చేకూరుస్తోంది. స్థానికులు ఫిర్యాదులు చేసినా, అధికారులు పట్టించుకోవడం **లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులు, ఎమ్మెల్యే స్పందించాల్సి ఉంది.** -ఆరిలోవ

- తూర్పులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- బాధితుల నుంచి టీడీపీ నేతల అక్రమ వసూళ్లు
- జీవీఎంసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడతారంటూ బాధితులకు భరోసా
- జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి
- అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లని జీవీఎంసీ అధికారులు



13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకులం పక్కన అనధికారిక నిర్మాణం

జీవీఎంసీ పట్టణ ప్రణాళిక నిబంధనలను ఉల్లంఘిస్తూ, చిన్న స్థలాల్లో సైతం 3, 4 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం జీవీఎంసీకి చెల్లించాల్సిన డబ్బులను స్థానిక టీడీపీ నాయకులకు వసూలు చేస్తున్నారు. దీంతో జీవీఎంసీ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

13వ వార్డు పరిధిలో..

జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ, దారపాలెంలో అక్రమ నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం పక్కన, బి.ఆర్.టి.ఎస్ రోడ్డును ఆనుకుని 100 చదరపు గజాల స్థలంలో అనుమతులు లేకుండా మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. గతంలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ నిర్మాణాన్ని అడ్డుకున్నప్పటికీ, ఇప్పుడు మూడో అంతస్తు కూడా పూర్తవుతోంది. ఇదే వీధిలో మరో రెండు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ విగ్రహం వీధిలో 60 చదరపు గజాల స్థలంలో ఉన్న పాత ఇంటిపై రెండు అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. వెనుకనే 100 చదరపు గజాల స్థలంలో ఎలాంటి ప్లాన్ లేకుండా మూడు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలు స్థానిక సచివాలయం పరిధిలోనే జరగడం గమనార్హం. సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీపై స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి తెస్తున్నారని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవద్దని బెదిరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ నాయకులకు అనుకూలంగా లేని నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై జీవీఎంసీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



13వ వార్డు శ్రీకృష్ణాపురం ఎన్టీఆర్ విగ్రహం వీధిలో అనధికారిక నిర్మాణాలు

ధారపాలెంలో జీవీఎంసీ స్థలంలో రేకుల షెడ్..



ఇదే వార్డు ధారపాలెంలో బీఆర్టీఎస్‌ను ఆనుకొని జీవీఎంసీ స్థలంలో ఓ వ్యక్తి సుమారు 200 చదరపు గజాల విస్తీర్ణంలో పెద్ద రేకుల షెడ్ నిర్మించేశాడు. ఇక్కడ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా బీఆర్టీఎస్‌కు ఇరుపక్కలా 30 అడుగులు వరకు స్థలాన్ని జీవీఎంసీ ఖాళీగా ఉంచింది. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ చేయాల్సి వస్తే ఈ ఖాళీ స్థలాన్ని వినియోగించుకోవచ్చని ఆలోచనతో విడిచిపెట్టింది. ఇక్కడ కొందరు ఆ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. ఇక్కడ ఓ వ్యక్తి పెద్ద షెడ్ నిర్మించాడు. దానిలో రోడ్డు వైపు షాపులు కోసం గదులు, వెనుక గోదాం కోసం భాగాలు చేశాడు. జీవీఎంసీ అధికారులు మాత్రం వారి స్థలం కబ్జాకు గురైనా పట్టించుకోకపోవడంపై విమర్శలకు తావిస్తోంది.

11వ వార్డులో అనధికారిక అంతస్తు..

జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి టీఐసీ పాయింట్ సమీపంలో ఓ వ్యక్తి అనధికారిక నిర్మాణం చేపడుతున్నాడు. ఇక్కడ 96 చదరపు గజాల స్థలంలో జీవీఎంసీ నుంచి జి ప్లస్ టు నిర్మాణం కోసం అనుమతి తీకొన్నాడు. అంతటితో ఆగకుండా స్థానిక టీడీపీ నాయకులు సహకారంతో అధనంగా అనధికారికంగా నాలుగో ఫ్లోర్ వేశాడు. ఇంత చిన్న స్థలంలో నాలుగు ఫ్లోర్లు వేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెత్తికూడా చూడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నిర్మాణానికి ఎదురుగా సుమారు కూతవేటు దూరంలోనే సచివాలయం ఉండటం విశేషం. 60 చదరపు గజాల నిర్మాణాలపై చూపుతున్న శ్రద్ధ అనధికారికంగా బిల్డర్లు చేపడుతున్న నిర్మాణాలపై ఇక్కడ సచివాలయం టౌన్ ప్లానింగ్ సెక్రటరీ చూపడమంలేదని స్థానికులు నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.



11వ వార్డు టీఐసీ పాయింట్ వద్ద అనధికారిక అంతస్తు..

ఆక్రమించిన స్థలంలో..



పైనాపిల్‌కాలనీలో ఆక్రమణ స్థలంలో అనధికారిక నిర్మాణం

ఇదే వార్డు పైనాపిల్ కాలనీలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి వెళ్లే దారి పక్కన ఓ వ్యక్తి తన స్థలంతో పాటు రెవెన్యూకి చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నాడు. గతంలో ఇక్కడ జరిపిన నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో స్థానిక టీడీపీ నాయకుల అండతో ఆ స్థలంలో ఇటీవల మళ్లీ నిర్మాణం ప్రారంభించేశాడు. ఇక్కడ సుమారు 100 చదరపు గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమించి తన స్థలంలో కలుపుకొని నిర్మాణం చేపడుతున్నాడు. దీనిపై రూరల్ మండలం వీఆర్వో సత్యం దొరను వివరణ కోరగా గతంలో దీన్ని నిలిపేశామని, ఇప్పుడు ఆ స్థలాన్ని మరోసారి సర్వే చేయిస్తామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పక్షుల కోసం ధాన్యం కంకులు ఏర్పాటు చేస్తున్న శంకర్‌రావు

ఎంవీపీకాలనీ: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్‌రావు పిలుపునిచ్చారు. ఎంవీపీ కాలనీలో గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇళ్ల టెర్రస్‌లపై పక్షుల కోసం ధాన్యం కంకులను ఏర్పాటు చేశారు. వేసవిలో పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఇళ్లపై నీటి తొట్లు ఏర్పాటు చేయడంతో పాటు, పక్షులకు ఆహారంగా వివిధ రకాల ధాన్యాలను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. భూమిపై వ్యవసాయం ప్రారంభమై 10 వేల సంవత్సరాలకు పైగా అవుతోందని, వ్యవసాయం ప్రారంభం నుంచి పక్షులు, ఇతర జీవరాశుల కోసం మనిషి కృషి చేస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయని శంకర్‌రావు అన్నారు. అయితే ప్రస్తుతం ఆ సంస్కృతి మారుతుండటంతో అనేక పక్షులు అంతరించిపోతున్నాయని, దీనివల్ల పర్యావరణం దెబ్బతిని అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ధరిత్రిని సురక్షితంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళల అదృశ్యం

ఎంవీపీకాలనీ: మద్దిలపాలేనికి చెందిన వివాహిత బొడిరెడ్డి శ్రీలక్ష్మీదేవి ఈ నెల 16న నగరంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె వెంట 15 తులాల బంగారం, రూ. 8 లక్షల నగదు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీలక్ష్మీదేవి ఒక వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడేదని వారు పేర్కొన్నారు. ఆమె కుమారుడు వంశీకృష్ణ చైతన్య రెడ్డి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాలరిఎండాకు చెందిన : జాలరిఎండాడకు చెందిన వివాహిత ఈలపు కన్నమ్మ అదృశ్యంపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కన్నమ్మ గత కొంతకాలంగా లాసన్స్‌బే కాలనీలోని కామత్ రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. అయితే ఈ నెల 20 తేదీన ఎప్పటిలాగే విధులకు వెళ్లిన కన్నమ్మ రాత్రి ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో కన్నమ్మ కొడుకు ఈలపు వెంకట్ ఎంవీపీ పోలీసులకు పిర్యాదు చేశారు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, పెండింగ్ క్లెయిమ్‌ల చెల్లింపు, రెన్యువల్ కోసం ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ఆయన వెల్లడించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోవడం అన్యాయమన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను వారి అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టి చలో విజయవాడ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ పార్కులో జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పోలేశ్వరరావు పాల్గొన్నారు.

కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ

దాబాగార్డెన్స్: అదనపు డీఎంఈ డాక్టర్ డి. వేంకటేశ్వరరావు మంగళవారం కింగ్ జార్జ్ హాస్పటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాద విభాగం (క్యాజువల్టీ)ను పరిశీలించి, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లపై చర్చించారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను కూడా ఆయన పరిశీలించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్, కేజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర ఆస్పత్రి ప్రతినిధులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లతో డాక్టర్ వేంకటేశ్వరరావు సమావేశమయ్యారు.

పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలి



ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డీటీకి వినతి పత్రం అందజేస్తున్న రామకృష్ణాపురం వాసులు



రూరల్ తహసీల్దారు కార్యాలయం ముందు దర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: ఇళ్ల పట్టాలు మంజూరు, రిజిస్ట్రేషన్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పేదలతో కలిసి మంగళవారం రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జీవో నంబర్ 30 ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, జీవో నంబర్లు 296, 388 ప్రకారం పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రాలు అందజేశారు. రామకృష్ణాపురంలో నిర్మించిన రేకుల షెడ్లకు జీవో నంబర్ 30 ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని గ్రామ సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు మరో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని, గతంలో మంజూరు చేసిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విస్మరించారని ఆయన విమర్శించారు. సుమారు 40 ఏళ్లుగా ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు స్థలాలు, కొండవాలు, మురికివాడలలో నిర్మించిన ఇళ్లకు కొన్నింటికి పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయలేదని, మరికొన్నింటికి పట్టాలు ఇవ్వలేదని ఆయన అన్నారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని రామకృష్ణాపురంలో సుమారు 600 మంది బడుగు వర్గాల వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. కబ్జాదారులకు, అక్రమార్కులకు సులువుగా పట్టాలు మంజూరు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, రామకృష్ణాపురం గ్రామ సంఘం సభ్యులు కాకర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనంపై కేసు నమోదు

ఎంవీపీకాలనీ: నక్కవానిపాలెంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రూ. 20 వేలు చోరీ జరిగిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ సమీపంలో నివాసముంటున్న ఎరుసు మణికుమారి ఈ నెల 9న డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఒక వేడుకకు హాజరయ్యారు. ఆమె తన హ్యాండ్‌బ్యాగ్‌ను ఒక కుర్చీలో ఉంచారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక, ఈ నెల 19న తన హ్యాండ్‌బ్యాగ్‌లో నగదును చూసుకోగా రూ. 20 వేలు కనిపించలేదు. దీంతో మంగళవారం ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, బాధితురాలు తెలిపిన అనుమానితుల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్



లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్ అని సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొనియాడారు. లెనిన్ 155వ జయంతి సందర్భంగా మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని మార్క్స్ ఇచ్చిన పిలుపును అందుకుని లెనిన్ రష్యాలో తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని నిర్మించారని అన్నారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయం తర్వాత ప్రపంచంలోని అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలు ఊపందుకున్నాయని ఆయన పేర్కొన్నారు. లెనిన్ చూపిన పోరాట స్ఫూర్తి భారత కమ్యూనిస్టు ఉద్యమంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, అది ఇప్పటికీ కొనసాగుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి. రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు, జి. కాసుల రెడ్డి, ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మే 10,11 తేదీల్లో సీపీఐ జిల్లా మహా సభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: సీపీఐ జిల్లా మహాసభలు మే 10, 11 తేదీల్లో మురళీనగర్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు మహాసభల పోస్టర్లను అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు, జి. కాసుల రెడ్డి, ఎన్. నాగభూషణం తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. నగరంలో ఐటీ అభివృద్ధి తదితర సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు.